
ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న యాదిరెడ్డి, తదితరులు

తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలాలు ఇవ్వండి

హయత్‌నగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం చేసిన ఉద్యమకారులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి కోరారు. ఈ మేరకు మంగళ వారం యాదిరెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారులు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ మేని ఫెస్టోలో పేర్కొన్న మేరకు ఉద్యమ కారులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి స్పందిస్తూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో చర్చించి ఉద్యమకారులకు న్యాయం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం నాయకులు నక్క జంగయ్యగౌడ్, డబ్బికార్ శ్రీనివాస్, వీరేష్ కుమార్, నారాయణరెడ్డి, శ్యామల, మహేందర్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.


దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న డ్రోన్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

డ్రోన్‌తో దోమల నివారణ మందు పిచికారీ

కొత్తపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ పరిధిలో గల మూసీ పరీవాహక ప్రాంతాల్లో డ్రోన్‌తో దోమల నివారణ మందు పిచికారీకి చర్యలు చేపట్టామని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. సత్యానగర్, జనప్రియ 1, 2, జనప్రియ అవెన్యూ, బృందావన్ కాలనీ, సమతాపురి తదితర కాలనీలకు సమీపంలో గల మూసీ ప్రాంతాల్లో మంగళవారం జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం ఏఈ రాంబాబు, సిబ్బంది డ్రోన్‌తో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో కాలనీల ప్రతినిధులు స్వామి, కృష్ణకిషోర్, నాయకులు కొత్త తిరుమల్, తోట మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

చౌరస్తాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయండి: బీజేపీ

సరూర్‌నగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వేసవి రాకముందే ఎండలు మండుతున్న నేపథ్యంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రధాన కూడళ్లలో ప్రజల దాహార్తి తీర్చేదుకు కార్పొరేషన్ తరపున చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని బీజేపీ నేతలు అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం పార్టీ బడంగ్‌పేట్ క్లస్టర్-1,2 అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చిత్రం శ్రీను, నివేదిత, సైదులు, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న సామాజిక సంఘ సంస్కర్తలు

దేవి అహిల్యాబాయి హోల్కర్ జయంతి ఉత్సవాలు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లిలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో దేవి అహిల్యాబాయి హోల్కర్ 300 జయంతి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత సామాజిక సంఘ సంస్కర్తలపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ డాక్టర్ వసంతగౌరి హాజరై మాట్లాడారు. అహిల్యాబాయి హోల్కర్ ధైర్యవంతురాలు, గొప్ప సామాజిక సంఘసంస్కర్త అని అన్నారు. 17వ శతాబ్దంలో సనాతనధర్మాన్ని పరిరక్షించడంలో ఆమె కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్స్ రాంచంద్రారెడ్డి, ఉమా మహేశ్వరరావు, బాలాజీ, అజ్మల్ హుస్సేన్, సలహాదారు రమణరెడ్డి, అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక మహాసంఘ్ సభ్యులు, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సైదాబాద్‌లో సంబరాలు జరుపుకుంటున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, తదితరులు

కొమురయ్య విజయం.. బీజేపీ శ్రేణుల సంబరాలు

సైదాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్క కొమురయ్య విజయం సాధించడంతో మంగళవారం సైదాబాద్ ప్రధాన రహదారిపై డివిజన్ అధ్యక్షుడు సూరజ్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకుంటూ స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవిందర్‌రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, నేతలు శ్రీకాంత్‌రెడ్డి, రమణ్‌సింగ్, రాజేష్, రవి, సుధీర్, సుభాష్, ప్రవీణ్, రవి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌ను కలిసిన టీఎన్‌జీఓ నాయకులు



రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సురేంద్రమోహన్‌ను ఆయన కార్యాలయంలో మంగళవారం టీఎన్‌జీఓ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చిలక నర్సింహారెడ్డి కార్యదర్శి ముత్రం సహఅధ్యక్షులు ఇ.వెంకటేశం, సెంట్రల్ యూనియన్ ఈసీ మెంబర్ సంతోష్, హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

- ఓల్డ్‌మలక్‌పేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి)

దేశ పురోగతిలో జీఎస్‌ఐ పాత్ర కీలకం

- డాక్టర్ ఎం.రామకృష్ణన్
- ఘనంగా జీఎస్‌ఐ వ్యవస్థాపక దినోత్సవం


వేడుకలను ప్రారంభిస్తున్న డాక్టర్ రామకృష్ణన్, సూరజ్ దామోజీ పట్వాజే, తదితరులు

మన్సూరాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): భౌగోళిక శాస్త్రీయ పరిశోధనలు, ఖనిజాల అన్వేషణతో పాటు సాంకేతిక ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్తూ దేశ పురోగతిలో భారతీయ భూవైజ్ఞానిక సర్వే సంస్థ (జీఎస్‌ఐ) కీలక పాత్ర పోషిస్తోందని సంస్థ విశ్రాంత సీనియర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం.రామకృష్ణన్ పేర్కొన్నారు. జీఎస్‌ఐ 175వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు నాగోల్ బండ్లగూడలోని సంస్థ జీఎస్‌ఐటీఐ కార్యాలయంలోని ఎంఎస్ కృష్ణన్ ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను జీఎస్‌ఐ అదనపు డైరెక్టర్ జనరల్, హెచ్‌ఓడీ సూరజ్ దామోజీ పట్వాజే, ఇతర అధికారులతో కలిసి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎం.రామకృష్ణన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1851లో స్థాపించబడిన జీఎస్‌ఐ సంస్థ రైల్వే బొగ్గును కనుగొనడం మొదలు నేటికీ ఎన్నో అత్యాధునిక భౌగోళిక శాస్త్ర ఆవిష్కరణల్లో అగ్రగామిగా ఉందన్నారు. అనంతరం అతిథులను, సీనియర్ ఉద్యోగులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. జీఎస్‌ఐ సంస్థ డీడీజీ డాక్టర్ ఎస్.రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ విశ్రాంత డీజీలు డాక్టర్ ఎన్.కుటుంబరావు, ఎం.రాజు, డీఎంజీ కె.శశాంక్, ఏఎండీ పీకే శర్మ, టీజీఎండీసీ ఎండీ బీఆర్‌వీ సుశీల్‌కుమార్, సింగరేణి జీఎం బి.శ్రీనివాసరావు, డాక్టర్ కేవీ సుబ్బారావు, ఎ.ఆచార్య, డాక్టర్ ఎంఎస్ ప్రవీణ్, కేవీ మారుతి, సంస్థ పీఆర్‌ఓ డాక్టర్ గంజి మల్లేష్, పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.

విజన్‌లేని రేవంత్ పాలన: ఎమ్మెల్యే సబిత


ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న వేంకటేశ్వరకాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

ఎల్‌బీనగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రాన్ని ఒక విజన్ అంటూ లేకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలిస్తున్నారని మాజీ మంత్రి, పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆరు గ్యారంటీలు అమలు కావడం లేదన్నారు. కేవలం ఫ్లెక్సీలకే వాటిని పరిమితం చేసి ప్రచారం చేసుకుంటున్నారని ఆమె ఆరోపించారు. మంగళవారం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని హుడా కాంప్లెక్స్‌లో పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి దృష్ట్యా మంచినీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థ, శానిటేషన్ సమస్యలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, తక్షణమే సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. హుడా కాంప్లెక్స్‌లో పార్కు నిర్వహణ సరిగాలేదని, ఆకతాయిలు, పోకిరీలు పార్కులోకి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా భవనాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వేంకటేశ్వరకాలనీలో సమస్యలను పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ సుజాత, మహేశ్వరం నియోజకవర్గ యూత్ మాజీ అధ్యక్షుడు లోకసాని కొండల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ దర్పల్లి అశోక్, వేంకటేశ్వరకాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ధనంరెడ్డి, కార్యదర్శి కనకారావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఏదైనా సాధించగలిగే సంకల్ప శక్తి మహిళల్లో అధికం

- రాచకొండ సీపీ సుధీర్ బాబు


రాచకొండ పోలీసు మహిళా అధికారులతో కలిసి కేక్‌ను కట్ చేస్తున్న సీపీ సుధీర్ బాబు

మన్సూరాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఈ సమాజంలో ఏదైనా సాధించగలిగే సంకల్ప శక్తి మహిళల్లో అధికంగా ఉంటుందని, వారి ప్రతిభను ప్రదర్శించడంలో ఎలాంటి అవరోధాలు వచ్చినా అధిగమిస్తూ అన్ని రంగాల్లో ఉన్నతంగా రాణించడం సంతోషకరమని రాచకొండ పోలీసు కమిషనర్ జి.సుధీర్ బాబు పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ పీబీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం రాచకొండ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ సహకారంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీ సుధీర్ బాబు విచ్చేసి మాట్లాడారు. దేశంలోని 70 కోట్లకు పైగా ఉన్న మహిళలకు పోలీసు శాఖల్లో పని చేసే మహిళలు స్ఫూర్తిదాయకమని అన్నారు. అనంతరం రాచకొండ పరిధిలోని డీసీపీలు, ఇతర పోలీసు ఉన్నతాధికారులు, మహిళా సిబ్బందితో కలిసి సీపీ సుధీర్ బాబు కేక్‌ను కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఆశారాణి, సైకాలజిస్ట్ డాక్టర్ గౌతమి వేడుకల్లో పాల్గొన్న రాచకొండ పోలీసు మహిళా సిబ్బందికి పలు మానసిక, ఆరోగ్య పరమైన సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డీసీపీ పద్మజ, ఎల్బీనగర్, యాదాద్రి, మహేశ్వరం డీసీపీలు ప్రవీణ్‌కుమార్, రాజేష్ చంద్ర, సునీతరెడ్డి, డీసీపీ అడ్మిన్ ఇందిరా, రోడ్ సేఫ్టీ డీసీపీ మనోహర్, ట్రాఫిక్-1, 2 డీసీపీలు మల్లారెడ్డి, శ్రీనివాసులు, ఉమెన్ సేఫ్టీ డీసీపీ ఉషావిశ్వనాథ్, సైబర్ క్రైమ్ డీసీపీ నాగలక్ష్మి, చీఫ్ కోఆర్డినేటర్ సావిత్రి, ఎల్బీనగర్ ఏసీపీ ఎ.కృష్ణయ్య, నాగోల్ ఇన్‌స్పెక్టర్ సూర్యానాయక్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


కాలనీల సభ్యులతో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా : కొప్పుల

మన్సూరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా కాలనీలు, ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీ, జడ్జెస్‌కాలనీ, వీరన్నగుట్ట శ్రీషిరిడీసాయినగర్ కాలనీ, పవనగిరి కాలనీ ఫేజ్-3లో ఆయా కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ వివేకానందనగర్ కాలనీలో రూ.50లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులు, వారంలో సీసీ రోడ్డు పనులను, శ్రీషిర్డీసాయినగర్ కాలనీలో రూ.10.50లక్షలతో, సహారాఎస్టేట్స్ గేట్-2 వద్ద రూ.30లక్షలతో, అదేవిధంగా పవనగిరి కాలనీ ఫేజ్-3లో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టి, నిలిచిపోయిన పనులను తొందరలోనే ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు సైదిరెడ్డి, పవన్, నర్సింహయాదవ్, హరిప్రసాద్, పుష్పలత, సాయిలుగౌడ్, సత్యపాల్‌రెడ్డి, మాదవ్‌రెడ్డి, విజయ్ భాస్కర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, సత్యం, కోటయ్య, నవీన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

20 కిలోల వెండి, బైక్ స్వాధీనం


వేణు


ఇంతియాజ్

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పిగ్లీపూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గత నెల 27న అబ్దుల్లాపూర్‌మెట్‌లోని పోలీస్‌స్టేషన్ పరిధిలోని పిగ్లీపూర్ గ్రామంలో హనుమాన్ ఆలయంలో గుర్తు తెలియని దొంగలు 15 కిలోల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. పూజారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పెద్దఅంబర్‌పేట్ ఔటర్ రింగురోడ్డు వద్ద మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు వాహన తనిఖీ చేశారు. ఓ బైక్‌పై ఇద్దరు వ్యక్తులు మహ్మద్ ఇంతియాజ్, రంగ వేణు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు ఆపి తనిఖీ చేశారు. వారివద్ద ఉన్న బ్యాగులో 20 కోలోల వెండి (బిస్కెట్‌ల రూపంలో) ఉన్నది. అనుమానం వచ్చిన పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారణ చేశారు. పిగ్లీపూర్‌లోని ఆలయంలో తామే చోరీ చేసినట్లు అంగీకరించారని పోలీసులు తెలిపారు. జల్సాలకు అలవాటుపడి సులువుగా డబ్బులు సంపాదించడానికి దొంగతనాలు చేస్తున్నట్లు తెలిపారు. ఘట్కేసర్, ఇబ్రహీంపట్నం, దుండిగల్, బీబీనగర్, జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వీరు దొంగతనాలకు పాల్పడినట్లు ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి తెలిపారు.

సాంస్కృతిక, సంగీత, సాహిత్య అవార్డులు ప్రదానం


పురస్కారాలను ప్రదానం చేస్తున్న ప్రముఖులు

అఫ్జల్‌గంజ్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కవి కోకిల దువ్వూరి రామిరెడ్డి విజ్ఞాన సమితి, పొనక కనకమ్మ ఆశయ సాధన సమితి జయంతి ఉత్సవాల సభ మంగళవారం రాజబహదూర్ వెంకట్రామిరెడ్డి భవనంలో జరిగింది. ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పొనక కనకమ్మ దువ్వూరి రామిరెడ్డి పేరిట సాంస్కృతిక, సంగీత, సాహిత్య అవార్డులు ప్రదానం చేశారు. ప్రముఖ రచయిత, పద్య కళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రాంచంద్రప్రసాద్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గోరేటి వెంకన్న, ఆంధ్ర చరణ్‌సింగ్ చందూరు రంగారావు, రిటైర్డ్ ఐఏఎస్ పి.రవికుమార్, ప్రొఫెసర్ వైబీ సత్యనారాయణకు ఈ అవార్డులను అందజేశారు. మాజీ మంత్రి వడ్డె శోభనాదీశ్వర్‌రావు, ఆర్ఎస్ఎస్ ప్రచారక్ వి.వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ మేకపాటి రామ్మోహన్‌రెడ్డి, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డాక్టర్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కొండా లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్‌రెడ్డి, బీఎస్ఎన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ మహిళా పురస్కారానికి సూర్యధనుంజయ్ ఎంపిక


సూర్యధనుంజయ్

బర్కత్‌పుర, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సూర్యధనుంజయ్ ఉత్తమ మహిళా పురస్కారానికి ఎంపికైనట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. తెలుగు భాష అధికారిగానూ, ఉమెన్స్ స్టడీస్ డైరెక్టర్‌గానూ సమర్థవంతంగా పనిచేశారని ఆయన తెలిపారు. విద్య, సాహిత్య రంగంలో ఆమె సాధించిన విజయాలు, నైపుణ్యం ఎందరికో స్ఫూర్తిదాయకం అని పేర్కొన్నారు. ఈనెల 7న జరిగే కార్యక్రమంలో అవార్డును హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వామన్‌రావు, అమీర్ గ్లోబల్ పీస్ ఫౌండేషన్ చైర్మన్ ఫారుఖ్ అలీఖాన్, హైకోర్టు న్యాయవాది ఉదయశ్రీ చేతుల మీదుగా ప్రొఫెసర్ సూర్యధనుంజయ్ అందుకుంటారని ఆయన తెలిపారు.

రైలు కింద పడి యువకుడి మృతి

బర్కత్‌పుర, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ ఎం.చిమ్నా తెలిపిన వివరాల ప్రకారం. విద్యానగర్ - కాచిగూడ రైల్వే స్టేషన్ల హద్య 35 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని యువకుడు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి శరీరంపై నలుపు రంగు ఆఫ్ టీషర్ట్ అదే రంగు జీన్స్ ప్యాంటు ఉన్నాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చిమ్నా తెలిపారు.

మాదన్నపేట మండీలో అక్రమ వ్యాపారాలను అరికడతాం : శ్రీనివాస్


వివరాలు తెలుసుకుంటున్న మార్కెట్ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్

సైదాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మాదన్నపేట కూరగాయల మార్కెట్‌లో ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ జరుగుతున్న అక్రమ వ్యాపారాలను అరికడతామని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున మండీలో ఆకస్మికంగా పర్యటించారు. రాత్రివేళల్లో ఇతర రాష్ట్రాల నుంచి లారీలలో వస్తున్న కూరగాయలు, ఆకుకూరలు, కొతిమీరు, కరివేపాకు హోల్‌సెల్ వ్యాపారాలపై ఆరా తీశారు. మార్కెటింగ్ శాఖకు రుసుం చెల్లించకుండా జరుగుతున్న వ్యవహారాలపై వ్యాపారులను నిలదీశారు. ఈ సందర్భంగా కోట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ మాదన్నపేట మార్కెట్‌పై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు రైతులను ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్‌లో సమస్యలపై అధికారులు, చైర్మన్, పాలక వర్గం సభ్యులపై చర్చించి నిర్ణయాలను తీసుకోనున్నట్లు వివరించారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గణేష్, రవితేజ, సంధ్యారాణి, తదితరులు

9న నాంపల్లిలో పద్మశాలీ మహాసభ

ఎల్‌బీనగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అఖిల భారత, తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 9న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పద్మశాలీ మహాసభ నిర్వహిస్తున్నట్లు పద్మశాలీ సంఘం ఎల్‌బీనగర్ సర్కిల్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత తెలిపారు. సరూర్‌నగర్‌లోని పద్మశాలీ సంఘం కార్యాలయం ఆవరణలో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 సంవత్సరాల తర్వాత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఈ మహాసభలో ముఖ్యఅతిథులుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వివిధ రాష్ట్రాలకు చెందిన పద్మశాలీ ప్రముఖులు పాల్గొననున్నారని తెలిపారు. పద్మశాలీలు భారీ సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు గడ్డం లక్ష్మీనారాయణ, కౌకుంట్ల రవితేజ, రావిరాల సంధ్యారాణి, చెరిపల్లి వర్ణలీల, పూర్ణిమ, చిక్క భారతమ్మ, పూర్ణిమ, అశ్విత, చెరిపల్లి శంకర్, శంకర్, పేర్ల వెంకటేష్, రమేష్, ఏల మహేష్, సీతా వెంకటేష్, జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

నేడు వృద్ధులు, దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

ఎల్‌బీనగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ లింబ్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో వయోవృద్ధులు, దివ్యాంగులకు ఉపకరణాలు అందజేయడానికి ఈనెల 5న సరూర్‌నగర్‌లోని జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా డీడీఆర్‌సీ నోడల్ అధికారి రమేష్, జీహెచ్‌ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ సుజాత తెలిపారు. వయోవృద్ధులకు చేతికర్రలు, వాకర్స్, వినికిడి యంత్రాలు, దివ్యాంగులకు చార్జింగ్ బ్యాటరీలతో నడిచే ట్రైసైకిళ్లు, కాలిపర్స్, కృత్రిమ కాళ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.ఈ శిబిరం ద్వారా అర్హులను గుర్తించి వారికి అవసరమైన ఉపకరణాలను అందజేస్తామని తెలిపారు. దరఖాస్తుదారులు కనీసం 40 శాతం వికలాంగ ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, లబ్ధిదారు ఆధార్ కార్డు, యూడీఐడీ కార్డు సమర్పించాల్సి ఉంటుందని ఆమె చెప్పారు.

రేపటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం

- సీతారామ భక్తాంజనేయ దేవస్థానంలో ఏర్పాట్లు


శ్రీసీతారామ భక్తాంజనేయ స్వామి దేవస్థానం

సరూర్‌నగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్ కింది వార్డులోని శ్రీసీతా రామ భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. గతంలో ఆలయ ఆవరణలో ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం ఇటీవల కింద పడిపోవడంతో, పండితుల సలహా మేరకు దాని స్థానంలో మరో ధ్వజస్తంభం ప్రతిష్ఠించాలని నిర్ణయించినట్లు వారు తెలిపారు. ఇందులో భాగంగా 6వ తేదీన సాయంత్రం 6గంటలకు విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనంతో ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నట్లు తెలిపారు. 7,8 తేదీల్లో ఆలయంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి, 9వ తేదీన ఉదయం 10.53 గంటలకు వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు.

8 నుంచి పోచమ్మతల్లి దేవాలయంలో..

వనస్థలిపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్ హుడా కాలనీ, ఫేజ్-2లోని ప్రసిద్ధ శ్రీ పోచమ్మతల్లి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఈనెల 8 నుంచి 10వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఎస్.రాములు, కాలనీ అధ్యక్షులు గాండ్ల ఆనంద్ రాజ్ తెలిపారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో వారు మాట్లాడుతూ ఈ నెల 8న ఆలయంలో గణపతిపూజ, పుణ్యవచనం, అంకురార్పణ, పంచగవ్యప్రాశనా, రక్షాబంధనం, 9న ఆరాధన చండివావనం, ధ్వజస్తంభ ఆరాధన, ధ్వజస్తంభ దాతలు భవానీ రాజశేఖర్- విజయ, భవానీ ప్రమోద్ కుమార్-అనిత దంపతుల సహకారంతో 10న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, కుంభప్రోక్షణ అలంకరణ, ఆశీర్వచనం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సంతోష్‌నగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11కేవీ విద్యుత్‌నగర్, సౌత్ ఎండ్‌పార్క్, జైన్‌మందిర్, కొత్తపేట్, విష్ణు థియేటర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహణపనుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ తెలిపారు. 11కేవీ విద్యుత్‌నగర్, సౌత్‌ఎండ్‌పార్క్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు, 11కేవీ జైన్‌మందిర్, కొత్తపేట్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 11కేవీ విష్ణు థియేటర్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ తెలిపారు.